సాక్షి కర్నూలు

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



హృదయ వేదన

వృద్ధులతోపాటు యువతలోనూ గుండెజబ్బుల ప్రమాదం వేగంగా పెరుగుతోంది. ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవనం హృదయ సంబంధ వ్యాధులు మరణాలకు కారణమవుతోంది. 8లో▸



వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

కొంతమంది గుర్తు తెలియని దుండగులు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన బాపులదొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,632.13
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:102
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:22,513
అవుట్ ఫ్లో	:14,408

న్యూస్‌రీల్

జిల్లాలో నాలుగు పత్తి కొనుగోలు కేంద్రాలు

కర్నూలు(అగ్రికల్చర్): మద్దతు ధరతో సీసీఐ పత్తి కొనుగోలుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ సి.రామాంజనేయులు, సహాయ సంచాలకులు నారాయణ మూర్తి తెలిపారు. పొడుగు పింజ పత్తికి మద్దతు ధర రూ.7,521, పొట్టి పింజ పత్తికి మద్దతు ధర రూ.7,121 ఉందని, ఇంతకంటే ధరలు తగ్గినప్పుడు రైతులు మద్దతు ధరతో సీసీఐకి అమ్ముకోవచ్చని సూచించారు. సీఎం యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపడతామన్నారు. ఈ ఏడాది జిల్లాలో పత్తి 1.92 లక్షల హెక్టార్లలో సాగయిందని, మార్కెట్‌లోకి దిగుబడులు మొదలైనందున సీసీఐ ఆధ్వర్యంలో ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడులో కొనుగోలు కేంద్రాలను సీసీఐ గుర్తించిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏల ద్వారా రైతులు పేర్లను రిజిష్టర్ చేయించుకోవాలన్నారు.

ఉల్లి రైతుకు నిరాశ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉల్లి భారీగా వస్తోంది. శనివారం 248 మంది రైతులు 7,541 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు తెచ్చారు. క్వింటాకు రూ.3వేల్లోపు ధర లభించడంతో నిరాశకు లోనయ్యారు. కనిష్టంగా రూ.529, గరిష్టంగా రూ.4,018 లభించింది. సగటు ధర కేవలం రూ.3,028 మాత్రమే నమోదైంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి ఉల్లి ధరలను పూర్తిగా తగ్గించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రకాష్‌రావు



కర్నూలు సిటీ: ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆప్టా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మధుసూదన్ రెడ్డి, సేవలాల్ నాయక్, నాయకులు వినోద్‌కుమార్, రాజాసాగర్, గోపాల్, ఖాదీకుల్లా శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాకి ప్రకాష్‌రావు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు చేశారన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక ఓపీ నిర్వహణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో ఓపీ నెం.44లో వీరికి వైద్యం అందిస్తారన్నారు. వారికి వచ్చిన వ్యాధులను బట్టి అవసరమైన స్పెషలిస్టుల వద్దకు వలంటీర్లు తీసుకెళ్లి చికిత్స చేయిస్తారన్నారు. ఈ మేరకు గత కొంత కాలంగా ఈ ఓపీకి ఆదరణ పెరిగి రోగుల సంఖ్య ఎక్కువైందన్నారు. దీంతో పాటు వారు దరఖాస్తు చేసుకుంటే అవసరమైన ధ్రువీకరణ సర్టిఫికెట్లు కూడా అందజేస్తున్నామన్నారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన పెంచుకోవాలి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధాన పంటలకు వ్యాపించే చీడపీడల నివారణపై అవగాహన పెంచుకుని రైతులకు సూచనలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. శనివారం కర్నూలు ఉద్యానభవన్‌లో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో కర్నూలు సబ్ డివిజన్‌లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి పత్తి, కంది తదితర పంటల్లో చీడపీడలు, నివారణ మార్గాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రస్తుతం ఉన్న తెగుళ్లు, పురుగుల నివారణపై ఆర్‌ఎస్‌ఏ సిబ్బంది అవగాహన పెంచుకొని రైతులకు చక్కటి సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు. కొందరు వ్యక్తులు పంటల్లో అక్కడక్కడ గంజాయి మొక్కలు నాటినట్లు తేలిందని, ఆర్‌ఎస్‌ఏల సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లినపుడు వాటిని గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఇన్‌చార్జ్ ఏడీఏ దస్తగిరిరెడ్డి, కర్నూలు డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్ సుజాతమ్మ, ఏపీఎంఐపీ ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏవోలు నాగసరోజ, శశిధర్‌రెడ్డి, గూడూరు ఏవో శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాపం చంద్రబాబుకే తగలాలి

- వంద రోజుల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం చంద్రబాబు డ్రామాలు
- మాజీ సీఎం వైఎస్ జగన్‌ను అప్రతిష్ట పాలు చేసే కుట్ర
- తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీం కోర్టు జడ్జిచే విచారణ చేయించాలి
- క్రిస్టియన్ అని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్‌తో డిక్లరేషన్ ఇప్పించగలరా..?
- చంద్రబాబుపై మండిపడిన వైఎస్సార్‌సీపీ నేతలు
- బాబు కుట్ర రాజకీయాలకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో పూజలు

'ఘోర అపచారం జరిగింది. వెంకటేశ్వర స్వామిని పలుచన చేస్తూ.. పవిత్రమైన ప్రసాదాన్ని లోకువ చేస్తూ.. పచ్చి అబద్ధాలతో సీఎం చంద్రబాబు నాయుడు తిరుమల ప్రతిష్ట దిగజారేలా చేశారు. చంద్రబాబు చేసిన పాపం వల్ల వెంకటేశ్వర స్వామికి కోపం రాకుండా.. బాబును శిక్షించేలా అందరూ గుడిలో పూజలు చేయండి' అంటూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కదిలి వచ్చారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. చంద్రబాబు రాజకీయ కుట్రపై ధర్మాగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం ఆలయాల్లో పూజలు చేశారు. భగవంతుడు.. చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని అర్చనలు చేశారు.



కర్నూలు నగరం వెంకటరమణ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కర్నూలు (టౌన్): వంద రోజుల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో కూటమి ప్రభుత్వం చేసిన విష ప్రచారంపై శనివారం జిల్లా ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పలు ఆలయాల్లో పూజలు చేసి నిరసన వ్యక్తం చేశారు. కల్తీ నెయ్యి పేరుతో తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా చంద్రబాబు చేసిన రాజకీయ కుట్రపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ ఆరాధ్య దైవమైన తిరుమల వెంకటేశ్వరుడి ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేసిన చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గోవిందా నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. టెంకాయలు కొట్టి చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని దేవుళ్లను కోరుకున్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని ఆలయాల్లో సంప్రోక్షణ, పూజలు చేశారు.

➤ కర్నూలులో వెంకటరమణ కాలనీలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, పార్టీ నేతలు పూజలు చేపట్టారు.

➤ పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కృష్ణానగర్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

➤ కృష్ణగిరి మండలం కర్లకుంట గ్రామ తిరుమలరాయుడు స్వామి ఆలయంలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆలూరులో సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే విరూపాక్షి, ఆదోని పట్టణం వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు.

➤ ఎమ్మిగనూరులో వీరశైవ లింగాయత్ మాజీ చైర్మన్ రుద్రగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి, సి.బెళగల్ మండలం క్రిష్ణదొడ్డి కొండపై ఉన్న కోనా వేంకటేశ్వరుడి ఆయలంలో నియోజకవర్గ నాయకులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ తదితరులు పూజలు చేశారు.

➤ మంత్రాలయంలో ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలయాల్లో టెంకాయలు కొట్టి చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుకున్నారు.



కల్లూరు పరిధిలోని కృష్ణానగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట భగవద్గీత చేతబూని నిరసన వ్యక్తం చేస్తున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

➡ పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తిరుపతి లడ్డూ వ్యవహారంలో బాబు అసత్య ప్రచారం బెడిసి కొట్టడంతో ప్రజలను డైవర్ట్ చేసేందుకు డిక్లరేషన్ ఇవ్వాలనే వాదన తీసుకువచ్చారని విమర్శించారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా రాష్ట్రంలో రాక్షస రాజ్యం నడుస్తోందని, దేవుడిని దర్శించుకోవాలంటే అనుమతి ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టించడం దారుణమన్నారు.



ఆలూరు సాయిబాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రబాబూ.. రెన్నెళ్లు నిద్రపోయావా?

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. తిరుమల లడ్డూ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడ్డంగా దొరికిపోయాడన్నారు. గత ప్రభుత్వంపై చేసినవి ఆరోపణలు ఒట్టివేనని తేలిపోయిందన్నారు. జూలై 12వ తేదీ కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వస్తే రెండు నెలల పాటు నిద్రపోయావా.. చంద్రబాబు.. అని విమర్శించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న టీటీడీ ఈఓపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తమ అధినేత తిరుమల దర్శనాన్ని అడ్డుకోవాలని ప్రభుత్వం ఎన్నో కుట్రలు చేసిందన్నారు. ప్రతిపక్ష హోదాలో, సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల దర్శనం చేసుకున్నారని, అప్పుడు డిక్లరేషన్ అడగ లేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే లడ్డూ వివాదంలో నిజనిజాలు తేల్చేందుకు సుప్రీం కోర్టు జడ్జిచే విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

➡ జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను కించే పరిచే విధంగా చంద్రబాబు వ్యవహరించడం దారుణమన్నారు.

➡ నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. తాను క్రిస్టియన్ అని, బైబిల్ చదివానని, క్రిస్టియన్‌ను పెళ్లి చేసుకున్నానని, బాప్తిజం తీసుకున్నానని చెప్పిన పవన్ కళ్యాణ్‌ను తిరుమలలో డిక్లరేషన్ అడిగే దమ్ము ఉందా ప్రశ్నించారు. చంద్రబాబు తప్పుల మీద తప్పులు చేయకుండా మంచి బుద్ధి ప్రసాదించాలంటూ ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు చెప్పారు.

➡ ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ వైఫల్యాను కప్పిపుచ్చుకునేందుకే మాజీ ముఖ్యమంత్రిపై లేని పోని ఆరోపణలు చేస్తుందని విమర్శించారు. మూడు నెలలలోపే ప్రభుత్వ వ్యతిరేకత వచ్చిందని, త్వరలోనే ప్రజలు ఎదురు తిరిగే రోజులు వస్తాయన్నారు.

➡ పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయడానికి చేతకాక జగనన్నపై చంద్రబాబు నాయుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. వంద రోజుల్లోనే ప్రభుత్వ వ్యతిరేకత రావడంతో ప్రజల దృష్టి మార్చేందుకు చంద్రబాబు లడ్డూ వివాదాన్ని తీసుకొచ్చారన్నారు.



కృష్ణగిరి మండలం కర్లకుంట తిరుమలరాయుడు స్వామి ఆలయం ఎదుట మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ఎమ్మిగనూరు వెంకటసాయి ఆలయంలో పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు



క్రిష్ణదొడ్డి కోనా వెంకటేశ్వరుడి ఆలయం ఎదుట మీడియాతో మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆదిమూలపు సతీష్



ఆదోని తిరుమలనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు అక్టోబర్ 1వ తేదీన కర్నూలు జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. పత్తికొండ మండలం పుచ్చకాయల మాడలో సీఎం పర్యటించి ఇంటింటా ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో పాల్గొననున్నట్లు చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులు, ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ పనులు గతంలోనే పూర్తయిన నేపథ్యంలో మరోసారి పరిశీలించాలని సూచించారు. పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయంతో బారికేడ్లను ఏర్పాటు చేయాలని, బయో టాయ్‌లెట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వేదిక నిర్వహణ, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. కాన్వాయ్ ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. సభా ప్రాంగణంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. సభా ప్రాంగణం వద్ద ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్ చేయడానికి కౌంటర్‌ను ఏర్పాటు చేసుకోవాలని హౌసింగ్ పీడీని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆదోని సబ్‌కలెక్టర మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో చిరంజీవి, కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి, పత్తికొండ ఆర్‌డీఓ రామలక్ష్మీ పాల్గొన్నారు.

ఇసుక లేకుండా ఇళ్లు ఎలా కట్టుకోవాలి



అధికారులను నిలదీస్తున్న లబ్ధిదారులు

పాణ్యం: ఇసుక లేకుండా ఇళ్లు ఎలా కట్టుకోవాలని, ఇంత వరకు ఇసుక ఎక్కడా దొరకడం లేదని గృహ నిర్మాణ లబ్ధిదారులు అధికారులను నిలదీశారు. శనివారం పాణ్యం జగనన్న కాలనీలో ''మన ఇళ్లు–మన గౌరవం'' నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్ నరంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, హౌసింగ్ ఏఈ మహబూబ్‌బాషా, ఈఓఆర్డీ సులోచన, ఆర్‌ఐ మహేశ్వరరెడ్డి, ఈఓ ఆనందరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో మంజురైన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో జోక్యం చేసుకున్న లబ్ధిదారులు, మేస్త్రీలు ఇసుక దొరకడం లేదని, అసలు ఇసుక ఎక్కడుందో తెలియడం లేదని, బ్లాక్‌లో దొరికినా ట్రాక్టర్ రూ.7వేల పైనే చెబుతున్నారన్నారు. అసలు ప్రభుత్వం ఇసుక పాలసీ ఎక్కడ ఉందో, ఉచిత ఇసుక ఎక్కడ దొరుకుతుందో చెప్పాలని అధికారులపై మండిపడ్డారు. ఇసుక లేకుండా ఇళ్లు ఎలా కడతారో చెప్పాలన్నారు. ప్రభుత్వం వచ్చి 4నెలలు పూర్తి చేసుకున్నా ఇసుక గురించి పూర్తి క్లారిటీ లేకపోతే ఎలాగని ప్రశ్నించారు. 'మీరే మాకు ఇసుక ఇవ్వండి.. లేకపోతే మాకు గత ప్రభుత్వం లాగా ఇసుక టోకెన్లు ఇవ్వండి' అంటూ అధికారులకు సూచించడంతో అధికారులు నీళ్లు నమిలారు. తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి మైక్ తీసుకోని ప్రస్తుతం నదుల్లో నీటి ప్రవాహం ఉందని, త్వరలోనే ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సర్ది చెప్పారు. రోడ్డు సరిగ్గా లేక వాహనాలు కాలనీకి రావడం లేదని లబ్ధిదారులు చేప్పగా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేను నిలదీసిన టీడీపీ నేతలు

- కౌన్సిల్‌లో అన్నా క్యాంటీన్‌ల బిల్లులు ఎందుకు పెట్టలేదని నిలదీత
- పూర్తిస్థాయి విచారణ తర్వాతే చెల్లిస్తామన్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే, కమిషనర్‌ను నిలదీస్తున్న టీడీపీ నాయకుడు రంగస్వామి


ఆదోని టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైందన్న మాటే కానీ, క్షేత్రస్థాయిలో టీడీపీ బీజేపీ మధ్య పచ్చిగడ్డి వేసినా భగ్గుమంటోంది. ఆదోనిలో బీజేపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నా టీడీపీ నేతల నిలదీతలు సర్వసాధారణమయ్యాయి. తాజాగా అన్నా క్యాంటీన్ల బిల్లుల విషయంలోనూ ఎమ్మెల్యేను టీడీపీ వర్గీయులు నిలదీయడం చర్చనీయాంశంగా మారింది. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ కృష్ణ ఆధ్వర్యంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. అనంతరం టీడీపీ నాయకులు రంగస్వామి, బాబు, వెంకటేశ్వర్లు, వెంకటేష్, బుద్దారెడ్డి, తిమ్మప్పలు మూకుమ్మడిగా కౌన్సిల్ హాలు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బిల్లుల విషయమై కమిషనర్‌తో పాటు ఎమ్మెల్యేపై ధ్వజమెత్తారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పార్థసారథి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాటాకు చప్పుళ్లకు తాను భయపడేది లేదన్నారు. పూర్తిస్థాయి విచారణ తర్వాతే బిల్లులు చెల్లిస్తామన్నారు. ఈ నేపథ్యంలో కొద్దిసేపు మున్సిపల్ కార్యాలయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. డీఎస్పీ సోమన్న, పట్టణ సీఐలు సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని నచ్చచెప్పి ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించేశారు.

ప్రత్యేక నేర చట్టాలపై న్యాయమూర్తులకు వర్క్‌షాప్



హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మథరావుతో సమావేశమైన జిల్లా జడ్జి కబర్ధి, కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు (లీగల్/సెంట్రల్): ప్రత్యేక నేర చట్టాలపై ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయమూర్తులకు జిల్లా కోర్టు హాల్‌లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ కె.మన్మథరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాపులో గృహ హింస చట్టం, నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం, పోక్సో చట్టాలపై న్యాయమూర్తులకు అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాప్‌లో జిల్లాలోని న్యాయాధికారులందరూ పాల్గొన్నారు. కాగా వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు నగరానికి చేరుకున్న హైకోర్టు జడ్జి డాక్టర్ జస్టిస్ మన్మథరావుకు జిల్లా అధికారులు స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం దగ్గర ఉన్న ఆయనను జిల్లా జడ్జి జి.కబర్ధి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్ బొకేలు అందజేశారు. అనంతరం వారు హైకోర్టు జడ్జితో మర్యాదపూర్వకంగా సమావేశమై జిల్లాలోని తాజా పరిస్థితులను వివరించారు.



క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన మహ్మద్ షఫీ

ఓర్వకల్లు: జాతీయ రహదారిపై నన్నూరు వద్ద అభి డాబా ఎదురుగా శనివారం తెల్లవారు జామున గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన మమ్మద్‌షఫీ(35) వ్యక్తిగత పనిమీద బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి బయలుదేరాడు. పని ముగించుకొని బేతంచెర్లలో బస్సు ఎక్కి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో నన్నూరు వద్ద బస్సు దిగి పూటుగా మదం తాగి నడుచుకుంటూ వెళ్తుండగా నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొంది. బలమైన రక్తగాయాలు కావడంతో హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

ఆరోగ్య సిబ్బందిపై డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆగ్రహం


వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఉయ్యాలవాడ: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే వైద్య బృందం ఉన్న చోట పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంపై డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి ఉండడం, మురుగు నీరు నిల్వ ఉండటం, ల్యాబ్ పరిశుభ్రంగా లేకపోవడం, వైద్యాధికారి రాబర్ట్ కెనడీ, సిబ్బంది పనితీరుపై డీఎంఅండ్‌హెచ్‌ఓ మండిపడ్డారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుని, కుళాయిలకు సరఫరా అయ్యే నీటిని కాచుకుని నీరు తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గర్భిణులకు సరైన వైద్యం చేసి, సలహాలు ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం చేసే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

World Heart Day
BOLLINENI MEDSKILLS PARAMEDICAL INSTITUTION
★ DMLT ★ DMIT ★ DDIALY ★ DMST ★ DPERFU ★ DCARDIO ★ DCLT ★ DANS
(Qlfy: Inter any Group) Admissions are in Progress
Cont: 7680945357, 7995013422, 9392251434
Bollineni Medskills 69/213-K-9, Joharapuram Road, Joharapuram, Kurnool - 518002

KURNOOL MUNICIPAL CORPORATION
e-Procurement Notice

Tender Notice No. 12-1/General Funds/EE&SE/Knl/ 24-25, Dt. 27.09.2024 (7 days Short tender)

Name of the Scheme	General Funds (7 days short tender)
No of works	01
Bid document download starting date	30/09/2024 at 5:30 P.M
Bid document download end date	09/10/2024 at 4:00 P.M
Last Date & Time for receipt of Bids	09/10/2024 at 5:00 P.M
Commercial Bid Opening Date	09/10/2024 at 5:30 P.M

Further details and Corrigendum can be seen @ e procurement market place at **www.tender.apeprocurement.gov.in.**
For Contact : 98499 08497, 98499 08470
Sd/- **S.Ravindra Babu,** M.A., Commissioner, Kurnool Municipal Corporation, Kurnool.

హృదయ వేదన

వృద్ధులతోపాటు యువతలోనూ గుండె జబ్బుల ప్రమాదం వేగంగా పెరుగుతోంది. ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవనం.. హృదయ సంబంధ వ్యాధుల మరణాలకు ప్రధాన కారణమవుతోంది. ఈనెల 29న ప్రపంచ గుండె దినోత్సవం. ఈ సందర్భంగా జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.
– కర్నూలు(హాస్పిటల్)

లక్షణాలు

కొంతదూరం నడవగానే ఆయాసం, ఛాతిలో పట్టేసినట్లుగా ఉండటం, చెమట ఎక్కువగా పడుతుండటం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటం ఉంటే గుండెజబ్బుగా అనుమానించాల్సి ఉంటుంది. సమీప ఆసుపత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకుని, అవసరమైన చికిత్స తీసుకోవాలి. గుండెపోటు వచ్చిన మొదటి కొద్ది నిమిషాలు కీలకమైనవి.



- పెరుగుతున్న గుండెపోటు మరణాలు
- ఉన్నఫలంగా కుప్పకూలుతున్న యువత
- ఒత్తిడి జీవితంతో మరింత కుంగుబాటు
- నేడు వరల్డ్ హార్ట్ డే

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగంలో ఐదేళ్లలో గుండెజబ్బుల కేసులు పెరిగాయి. 2019 నుంచి ఇప్పటి వరకు 90,475 ఓపీ, 14,597 ఐపీ కేసులు నమోదయ్యాయి. వీరిలో 4,36,158 మందికి ఈసీజీ తీయగా 77,783 మందికి 2డీ ఎకో పరీక్ష చేయాల్సి వచ్చింది. ఇందులో 272 మందికి హోల్టర్ చేశారు. 1,095 మందికి టీఎంటీ పరీక్ష నిర్వహించారు. 3,328 మందికి యాంజియోగ్రామ్ నిర్వహించి, 1,188 మందికి స్టెంట్‌లు వేశారు. అధిక శాతం ఆరోగ్యశ్రీ(ఎన్‌టీఆర్ వైద్యసేవ) ద్వారా చికిత్స అందించినా కొన్ని ఆసుపత్రులు రోగుల నుంచి మెరుగైన వైద్యం కోసమంటూ డబ్బు వసూలు చేస్తున్నాయి. ఈ విషయమై రోగుల నుంచి ఫిర్యాదులు రావడంతో కొన్ని ఆసుపత్రులకు జరిమానాలు విధించి, మరికొన్నింటికి ఆరోగ్యశ్రీని నిలిపివేశారు.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గుండెజబ్బుల విభాగం

రెగ్యులర్ వ్యాయామం

శారరీక శ్రమ లేకపోవడం కూడా గుండెజబ్బులకు ప్రధాన కారణం. వాకింగ్, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి 30 నిమిషాల శారీరక శ్రమను ప్రతిరోజూ చేయాలి. ఇది గుండెను బలపరుస్తుంది. శరీరంలో కొవ్వు పేరుకోకుండా చేస్తుంది. తద్వారా ఊబకాయం, రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది.

సమతుల్య ఆహారం

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం చాలా ముఖ్యం. జంక్‌ఫుడ్, చక్కెర, అధిక కేలరీల ఆహారాన్ని నివారించండి. వీటికి బదులుగా మీ ఆహారంలో బాదం, వాల్‌నట్స్, అవకాడో, క్యారెట్ వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను చేర్చాలి. ఈ విషయాలు గుండె సిరలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.

ఒత్తిడిని తగ్గించండి

ఎక్కువసేపు మెలకువగా ఉండటం, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను ఎక్కువగా ఉపయోగించడం వల్ల గుండెపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అటువంటి పరిస్థితిలో తగినంత నిద్ర(7–8 గంటలు) తీసుకోండి. ఒత్తిడిని తగ్గించేందుకు యోగా, ధ్యానం చేయండి. ఇది శరీరం ఒత్తిడి స్థాయిని తగ్గిస్తుంది. ఇది గుండెకు ప్రయోజనకరంగా ఉంటుంది.

జీవనశైలి మెరుగుపరచుకోండి

హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి జీవనశైలిని మెరుగుపరచుకోండి. పోషకాహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను స్వీకరించండి. దీంతో మీరు గుండెజబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు. ఏడాదికి ఒకసారైన ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యులను సంప్రదించండి.

ఐదేళ్లలో గుండె రోగుల వివరాలు

సంవత్సరం	ఓపీ	ఐపీ	ఈసీజీ	2డీ ఎకో	హోల్టర్	టీఎంటీ
2019	19,615	3,548	83,076	17,679	53	132
2020	9,574	1,142	49,046	4,547	11	44
2021	10,539	2,012	61,641	10,746	32	21
2022	13,787	2,913	79,172	15,884	73	320
2023	21,120	2,944	86,702	17,362	63	301
2024 (ఇప్పటివరకు)	15,840	2,038	76,521	11,565	40	275
మొత్తం	90,475	14,597	4,36,158	77,783	272	1,093

కారణాలు

ధూమపానం, నెయ్యి వాడకం, పరగడుపున రక్తంలో గ్లూకోజ్ ఎక్కువగా ఉండటం, అధిక కొలస్ట్రాల్, రక్తపోటు, శారీరక వ్యాయామం బాగా తగ్గడం, తల్లిదండ్రుల్లో గానీ, తోబుట్టువులలో గానీ ఎవ్వరికైనా గుండెపోటు వచ్చినా కానీ ముందుగానే ఈ సమస్య ఉండటం, లిపోప్రోటీన్–ఎ, హైపర్ హోమోసిస్టెమియా, హైపర్ కాగ్యులబుల్ పరిస్థితి, కొకైన్ వాడకం లాంటివి ఉంటే ఈ సమస్యలు వస్తాయి. ధూమపానం ఉంటే 72 శాతం, అధిక కొలెస్ట్రాల్ ఉంటే 52 శాతం, కుటుంబంలో ఎవ్వరికైనా హార్ట్ ఎటాక్ చరిత్ర ఉంటే 35 శాతం గుండెపోటు వచ్చే అవకాశం యువతో ఎక్కువగా ఉన్నాయి.

గుండె జబ్బులు రాకుండా ఉండాలంటే..

- మద్యపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి.
- ప్రతిరోజూ వాకింగ్, యోగా, ధ్యానం చేయాలి
- శాస్త్రీయ సంగీతం వినాలి, పాత పాటల్లోని సాహిత్యం మనస్సుకు ఎంతో హాయినిస్తుంది. పాశ్చాత్య సంగీతం బీపీ, హార్ట్ బీట్‌ను పెంచుతుంది.
- లిఫ్ట్‌లో వెళ్లడం కంటే మెట్లు ఎక్కడమే మేలు
- సమతుల ఆహారం వల్ల గుండెకు బలం చేకూరుతుంది.
- నూనెలో వేయించిన ఆహారాన్ని తగ్గించుకోవాలి. బయట లభించే ఫాస్ట్‌ఫుడ్స్, బేకరి ఫుడ్స్‌కు, దిగుమతి చేసుకున్న చికెన్ లెగ్స్‌కు దూరంగా ఉండాలి.
- బజ్జీలు తినాల్సి వస్తే ఇంట్లోనే చేసుకోవాలి.
- బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. స్థూలకాయం తగ్గించుకోవాలి.
- వయస్సుకు తగినట్లు నిద్రపోవాలి. నిద్ర తగ్గితే శరీరం రోగాలను ఆహ్వానిస్తుంది.



గుండెజబ్బుల పట్ల అవగాహన పెరగాలి



ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ గుండె జబ్బుల పట్ల అవగాహన పెంచుకోవాలి. ఈ మేరకు గుండెకు ప్రధాన శత్రువులను దూరంగా ఉంచుకోవాలి. ఇందులో భాగంగా ధూమపానం, మద్యపానాలకు దూరంగా ఉండాలి. బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. మంచి ఆహారపు అలవాట్లను అలవాటు చేసుకోవాలి. ఆహారంలో ఉప్పు, షుగర్, కొవ్వు పదార్థాలను తగ్గించాలి. బయటి ఫుడ్‌కు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. వైద్యుల సూచన మేరకు మందులు వాడుతూ ఉండాలి.
– డాక్టర్ పి.చంద్రశేఖర్, ప్రొఫెసర్, కార్డియాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

నేడు అక్కినేని పురస్కారాల ప్రదానం

కర్నూలు కల్చరల్: స్థానిక సీక్యాంప్ కళాక్షేత్రంలో కొనసాగుతున్న నటసామ్రాట్, పద్మశ్రీ అక్కినేని నాగేశ్వర రావు శత జయంతి వేడుకలు ఆదివారం ముగియనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రతిభా విద్యా సంస్థల అధినేత ఎం.అరుణాచల రెడ్డి, గజల్స్ గాయకుడు, హెచ్ ఎం ఎస్.మహమ్మద్ మియ్యా, రిటైర్డ్ ఎంఈఓ పి.రాజారత్నం, హాస్య నటులు, విశ్రాంత ఉద్యోగి సంగా ఆంజనేయులు, లలిత కళా సమితి మాజీ అధ్యక్షులు, విశ్రాంత అధ్యాపకులు పి.దస్తగిరి, జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.వి. రమణారెడ్డి, రచయిత, ఉపాధ్యాయుడు ఎస్.ఎం.డి. ఇనాయతుల్లాకు అక్కినేని పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అలాగే విజయవాడ వెలగేరు ఆర్ట్స్ కళాకారులు 'రాత' నాటికను ప్రదర్శిస్తారని తెలిపారు.

నేటి నుంచి ఎల్లార్తి ఉరుసు ప్రారంభం



హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి తాతల ఉరుసు ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. నిర్వాహకులు దర్గాల ముఖద్వారాలు, సమాధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆదివారం గంధం, సోమవారం ఉరుసు, మంగళవారం జియారత్ కార్యక్రమాలతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయని సర్పంచ్ కురువ చాముండేశ్వరి తెలిపారు. శేక్షావలి, షాషావలి దర్గాల పరిసరాలు, గ్రామంలోని ఆయా వీధులు, బస్టాండు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులతోపాటు తాగునీటి వసతి, భక్తులకు ట్యాంకర్‌తో నీటి సరఫరా, వీధిలైట్లు, డ్రైనేజీలలో పూడికతీత పనులు చేపట్టామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉరుసుకు వచ్చే భక్తుల కోసం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

1న రాష్ట్రస్థాయి పోటీలు

నంద్యాల(న్యూటౌన్): అక్టోబర్ 1న కేఎస్ఎం మున్సిపల్ పాఠశాల క్రీడా మైదానంలో తైక్వాండో, హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోడో అండర్–17 హ్యాండ్ బాల్ అండర్–14, 17 బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఎండీఎం ఫాంలో ఫైల్ అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎవరి జోడో కిట్టు వారే తెచ్చుకోవాలన్నారు. ఉదయం 9గంటలకు క్రీడా మైదానానికి చేరుకోవాలన్నారు. పోటీలను కర్నూలు, నంద్యాల డీఈఓలు సామేలు, సుధాకర్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు.

నేటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు


మాట్లాడుతున్న మోహన్‌కుమార్

కర్నూలు (టౌన్): నగరంలోని రిడ్జ్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బాలుర విభాగంలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ మోహన్‌కుమార్ తెలిపారు. శనివారం అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీబీఎస్ఈ క్లస్టర్ 7 కింద అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 150 స్కూళ్ల నుంచి 3,500 మంది క్రీడాకారులు పాల్గొంటారని, 24 మంది రెఫరీలు పర్యవేక్షణ చేస్తారని వెల్లడించారు. సమావేశంలో రిడ్జ్ పాఠశాల సీఈఓ గోపీనాథ్, గ్లోబల్ స్కూల్ సీఈఓ జి.వంశీధర్ పాల్గొన్నారు.

అక్టోబర్ 6న జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): అక్టోబర్ 6న స్థానిక గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల క్రీడా మైదానంలో జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీగురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలలో క్రీడాపోటీల బ్రోచర్‌ను కర్నూలు జిల్లా సాఫ్ట్‌బాల్ సెక్రటరీ విజయకుమార్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామకృష్ణ పీజీ కళాశాల, గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలిస్తున్న ప్రజలు

పెద్దకడబూరు: కొంతమంది గుర్తు తెలియని దుండగులు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన మండల పరిధిలోని బాపులదొడ్డి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. శనివారం ఉదయం ఆ రహదారిలో వెళ్తున్న ప్రజలు చూసి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి, వైఎస్సార్ సీపీ నాయకులకు, పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు విగ్రహాన్ని అక్కడి నుంచి బాపులదొడ్డి గ్రామం లోపలికి తరలించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు విగ్రహం ధ్వంసమైన ప్రదేశాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఇలాంటి పనికిమాలిన పనులు మానుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పెద్దకడబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డిని కలసి ఫిర్యాదు చేశారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత


మద్యం, నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కోడుమూరు రూరల్: కర్ణాటక నుంచి కారులో ఇతర ప్రాంతాలకు 15 బాక్స్‌ల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శనివారం కోడుమూరులో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరిని అరెస్ట్ చేసి, మరో వ్యక్తిపై కేసు నమోదు చేయడంతోపాటు, మద్యం తరలిస్తున్న కారును సీజ్ చేశారు. కోడుమూరు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు.. కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో సీఐ రామాంజనేయులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఉల్చాల గ్రామానికి చెందిన గడ్డం నాయుడు తన కారులో 15 బాక్స్‌ల్లో తరలిస్తున్న కర్ణాటక 1440 టెట్రా ప్యాకెట్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గడ్డం నాయుడును అరెస్ట్ చేయడంతో పాటు, కారును, రూ.64,500 విలువ చేసే మద్యాన్ని సీజ్ చేశారు. కారు యజమానిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. తనిఖీల్లో కోడుమూరు ఎక్సైజ్ ఎస్ఐ అలిబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

AUTOMOBILES
■ M.S.R ఆటో కన్సల్టెన్సీ: 15సం॥లు పైబడిన అన్ని రకముల వాహనములు, ఎంత పాతవైనా, ఇంజన్ సీజ్ అయినా కొనబడును. Note: ఒరిజినల్ రికార్డ్స్‌తో సంప్రదించగలరు. ✆ 95537 70909, 93928 88275. [L-794935]

REAL ESTATE
■ వేగంగా అభివృద్ధి చెందుతున్న కర్నూలు సిటీలో ప్లాట్లు, భూములు, ఇండ్లు కొనాలన్నా, అమ్మాలన్నా సంప్రదించండి: జె.వై.శాస్త్రి, సెల్: 96762 11033. [L-796561]
■ నంద్యాల జిల్లాలో ప్లాటింగ్ డెవలప్‌మెంట్, హౌస్ డెవలప్‌మెంట్ చేయబడును. మెటీరియల్ కాంట్రాక్టు చేయబడును. సంప్ర: 9951597247, 8247617139. [L-796560]

PLOT FOR SALE
■ ఫ్యూచర్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ వారి న్యూవెంచర్ అక్షయ డ్రీమ్ వ్యాలి హంస్సీనాపురం ఊరు ఆనుకొని వివిధ వెంచర్ల మధ్యన తక్షణం ఇల్లు కట్టుకొనే అవకాశం కలదు. తక్కువ ధరకు ప్లాట్లు అమ్మబడును. సంప్ర: 6305855630. [L-783344]

LAND FOR SALE
■ 5100 చ॥గ॥ ఓపెన్ కమర్షియల్ సైట్ చెన్నై to కోల్‌కత్తా NH-16కు ఆనుకొని తూర్పు-దక్షిణం కార్నర్ బిట్ చిలకలూరి పేటకు (టు - గుంటూరు) 6 kms దూరంలో నెలకు 1,30,000/- అద్దె వచ్చును) క్లియర్ టైటిల్ అమ్మకమునకు కలదు. చ॥గ॥ 21,000/- ✆ 93464 31345, 89769 47945 [B-271]

SHOP FOR SALE
■ కమర్షియల్ షాప్స్ అమ్మకం: కర్నూలు ఎస్.ఆర్.పేట, బాలాజీ నర్సింగ్ హోమ్ ప్రక్కన, 2 సైడ్ రోడ్ గల కొత్తగా నిర్మాణంలో ఉన్న (15x24) షాప్స్ అమ్మబడును. ✆ 9951597247, 8247617139. [L-796559]

HOUSE FOR SALE
■ తూర్పు-ఉత్తరం కార్నర్, నూతనంగా నిర్మించిన Duplex House (G+2) Fullly furnished (3000 sft) నంద్యాల చెక్‌పోస్ట్ దగ్గర, వినాయక గుడి వెనుక భాగములో అమ్మకమునకు కలదు. Bedrooms 5 No.s, Halls 3No.s, Corridors 3No.s, Car Parking, Bore కలవు. సంప్రదించండి: 9440282771, 9703741054. [L-794926]

LEASE / RENT
■ DHANUNJAYA VARMA COMPLEX, 120FT BELLARY MAIN ROAD. FACING-6 SHOPS-(W-72FTxL-57FT=4100sq.ft) LEASE/RENT-BEST FOR BANKS, SHOW ROOMS, COMMERCIAL OFFICE SPACE ETC, CONT: 9393866399, 9440457679. [L-783345]
■ గుత్తి హైవే రోడ్డుకి దూపాడు రైల్వే స్టేషన్ ప్రక్కన 60 వేల నుంచి 65 వేల చదరపు అడుగులలో గోడౌన్ నిర్మించి లీజుకు ఇవ్వబడును. ఆసక్తి గలవారు సంప్ర: 98859 06662 [L-794930]

TO - LET
■ కర్నూలు-గాయత్రి ఎస్టేట్, కోట్ల రైల్వే స్టేషన్ ప్రక్కన 50 కార్లు పార్కింగ్ గల 11 సెంట్ల కమర్షియల్ బిల్డింగ్ డాక్టర్స్ నర్సింగ్ హోమ్స్ కార్పొరేట్ హాస్పిటల్స్‌కు అద్దెకు ఇవ్వబడును. ✆ 99481 23099 [L-794945]
■ 2300 Sqft Shed for Rent Near & Behind Vaartha Office, Nandikotkur Road, Vasavi Nagar, Kurnool. ✆ 9949004902, 7799273030. [L-794934]
■ 3 BHK FLAT FOR (1500 SFT) Rent at 1st Floor. In Skanda Park View, Chanikyapuri Colony, A.Camp, Kurnool. ✆ 98851 62885. [L-794946]

BUILDING FOR SALE
■ G+1 Building Sale Face NH 44, Kurnool Adj Maruthi Flat 6 Shops Suiting Commercial Auto Nagar. ✆ 9440703783, 9985138260 [H-804867]

SERVICES
FOR SALE
■ నాణ్యమైన, ఆరోగ్యవంతమైన పొట్టేళ్ళు అమ్మబడును. లైవ్ ధర కిలో రూ॥400/-, వివరాలకు సంప్రదించండి. కర్నూలు. సెల్: 89789 05906. [L-796555]

HEALTH CARE
GYNECOLOGY
■ డా॥ కె.అరవింద MBBS, DNB, OBG గర్భిణీ మరియు స్త్రీ వ్యాధి నిపుణురాలు. 2PM To 5PM & 5 PM-9PM. శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు. ✆ 88970 87874 [L-796564]

UNANI
■ దీర్ఘకాలిక క్యాన్సర్, కిడ్నీ స్టోన్స్ మరియు చిన్న పిల్లల పోలియో వ్యాధులకు యునాని మందుల ద్వారా చికిత్స చేయబడును. సంప్ర: M.D.షఫీ హకీమ్, కర్నూలు. సెల్: 93970 11918 [L-783334]

GENERAL & LAPROSCOPIC SURGEON
■ KGN మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, KVR గార్డెన్, వడ్డేగేరి, కర్నూలు. ఆరోగ్య శ్రీ ద్వారా అపెండిక్స్, మొలలు, హెర్నియా, థైరాయిడ్, కాలిక్ట్ క్లోమాలు, ఆర్థోపెడిక్, యూరాలజీ, ENT, సర్జికల్ గ్యాస్ట్రో, మొ॥ శస్త్ర చికిత్సలు చేయబడును. ✆ 9346348653 [L-796563]

PHYSICIAN
■ డా॥కె.చంద్రమౌళి రెడ్డి, Gen. MED, IDCCM, జనరల్ ఫిజిషియన్, ఫెలో ఇన్ క్రిటికల్ కేర్ యూనిట్, అడ్రస్: శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు. సెల్: 88970 87874. [L-796565]

AYURVEDIC
■ డా॥M.మహిపాల్, M.S.,(AYU) పైల్స్, ఫిస్టులా, ఫిషర్‌కు ఆయుర్వేద క్షార సూత్ర ద్వారా శాశ్వత పరిష్కారం. ప్రతి నెల 2వ మరియు 4వ ఆదివారం చూడబడును. శ్రీ వెంకటసాయి ఆయుర్వేదిక్ హాస్పిటల్, వి.ఆర్.కాలనీ, కర్నూలు. ఫోన్: 99599 49739. [L-783332]

ORTHOPEDIC SURGEON
■ డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. ✆ 08518 - 228666, 83412 98666. [L-783319]

MARRIAGE SERVICES
వధువు కావలెను
■ ముస్లిం షేక్: 27Yrs/5.8/BBM, MBA 8 Lakhs Salary: P.A., వరుడికి తగిన చదువుకున్న సంప్రదాయమైన ముస్లిం వధువు కావలెను. డైరెక్ట్ వాట్సప్: 79815 61643. [L-783312]

VASTHU
■ మీ ఇల్లు చూసి అంత కొలచి వాస్తు మార్పులు చెప్పబడును. కొత్త ఇంటి ప్లానులు 100% గ్యారంటీ ఇవ్వబడును. మీఇల్లుపూర్తయ్యే వరకు అందుబాటులో ఉండగలము. గౌరు వాస్తు యం. మస్తెయ్య ✆ 9640964570 [G-782813]

BUSINESS OFFER
■ మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతి నెలా ఆదాయం కావాలా? మీ దుకాణంకి ప్రచార ప్రకటనలు జోడి చేసి ప్రతి నెలా 7000/–ఇస్తాము. Contact Numbers: 9948000371, 9948000373 [H-1241126]

WANTED
■ ప్రముఖ బ్యాంకింగ్ & ఇన్సూరెన్స్ కంపెనీలో Off Role ఎంప్లాయిస్ కావలెను. వ.30పైన, అర్హతలు: డిగ్రీ, గృహిణులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారస్తులు, ప్రభుత్వ/ప్రైవేట్ ఉద్యోగులు (స్త్రీ/పు). ✆ 7780446001. [L-796569]
■ మా రియల్ ఎస్టేట్ సంస్థ కర్నూలు యందు Digital Marketing రంగంలో పనిచేయుటకు అనుభవజ్ఞులైన వ్యక్తులు కావలెను. Kunool. Exp: 0 to 10 years. Cont: 9676446696, 9000737431. [L-522]
■ ప్రముఖ బ్యాంక్స్ నుండి పర్సనల్/హోమ్/బిజినెస్ మొ॥ లోన్స్ ఇప్పించుటకు లేడి టెలికాలర్ ఇంటి వద్ద నుండి ఫుల్/పార్ట్ టైం పనిచేయుటకు కావలెను. సంప్ర: 9866504962. [L-796566]
■ పెట్రోల్ బంక్ నందు పనిచేయుటకు పంపు బాయ్స్ కావలెను. కారు, లారీలు నడుపుటకు డ్రైవర్స్ కావలెను. ఆసక్తి గల వారు బయోడేటా వాట్సప్ చేయగలరు. సెల్: 80086 78969. [L-794942]
■ ప్రముఖ జిరాక్స్ షాపులో పనిచేయుటకు స్త్రీ/పురుషుడు కావలెను. మరియు ఫోటో షాప్, పేజ్‌మేకర్ తెలుగు టైపింగ్ అనుభవం కలిగిన డిజైనర్ కావలెను. ✆ 7989154773, 9030490788. [L-796567]
■ ఇంటి పని, వంట పని చేయుటకు ఇంట్లో ఉండి ఇద్దరికి 50 సం॥ లోపు బాదరా బందీ లేని ఆడ మనిషి కావలెను. జీతం+వసతి. సంప్ర: 94401 22661. [L-796568]
■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు అకౌంటెంట్, క్లర్క్ (రెవెన్యూ పరిజ్ఞానం కలిగిన) & అటెండర్ కావలెను. సంప్రదించండి: 96429 97815 [L-794939]
■ బృందావన్ ఇంజనీరింగ్ కాలేజీ, పెద్దటేకూరు, కర్నూలు (డోన్ రోడ్) వారికి Administrative officer, Experienced Candidate కావలెను. Mobile: 81422 33352 [L-794941]
■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ టీమ్ కావలెను. FIXED Salary+Monthly GIFTS+Attractive Incentives. Join with us for Bright Future and Unlimited Income. Cell: 8919570306. [L-796558]
■ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు అనుభవం గల సేల్స్‌మేన్, సేల్స్ గర్ల్స్ కావలెను. మంచి జీతం+ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, కర్నూలు. ఫోన్: 81858 37786. [L-794940]
■ Wanted Lady Supervisors, Pharmacist with certificates, Cath Lab Scrub Nurses, Cath Lab Technicians, OT Assistant, Contact: SRI VIJAYADURGA CARDIAC CENTRE, Gayathri Estates, Kurnool. Cell: 95029 23838, 86986 05193. [L-783346]
■ Wanted Experienced Candidates for Following Positions. (A) Hospital Supervisor (B) Marketing Supervisor. Minimum Qualification: Graduate and above. Salary depends on candidates Experience and efficiency. Contact: 63030 48598, 08518-279898, 255500. Time Between 8:30 AM TO 8:30 PM. [L-794943]
■ Wanted Male Academic Principals Qualification Any Degree: Age Limit: 30 to 45 years. Salary upto: 30,000/- and Female Hostel incharges. Salary Upto: 12,000/- plus Food and Accomodation Qualification: Any Inter/Degree. Location: Kurnool. Contact: 9248733342 [G-5691]
■ Wanted Experienced Female Tele Caller work from home for Loans Sal + Incentives. Contact Cell: 90301 00111. [T-2313]
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18k. ఫోన్: 9640258899, 9640468899 [H-796281]
■ హైదరాబాద్‌లో ప్రముఖ యూనివర్సిటీలో 200 మంది (Ex-Army) సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. (జీతం:8Hrs. 19,500/- & 12 Hrs. 28,200/-, 4సెలవులు + ఉచిత వసతి).ఫోన్: 9959438789 [H-804876]
■ డిజిటల్ ప్రింటర్స్ నందు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగము ఇవ్వబడును. హైదరాబాద్‌లో mim. Comp. నాలెడ్జ్ ఉండవలెను. పురుషులు మాత్రమే. Ph: 9989374446 [HA-98600]
■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, వార్డ్ బాయ్స్, ఆయాలు, లేడి సూపర్‌వైజర్స్ భార్యభర్తలు కావలెను.Ph: 9391036931, 9246585901 [HA-14711]
■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP& డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9182260297 [HA-98612]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ వింగ్
70750 09165
70750 09185
4 Lines Classified Rs. 300/-
For Extra Line Rs. 75/-
Classified Display Rs. 215/-